క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐసీడీఎస్ పరిధిలో ఉన్న 2 మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ పి.రంగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురండి, రాజుగాడిగూడ కేంద్రాల్లో పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయా స్థానాలను ఎస్టీలకు కేటాయించారు. అర్హులైన స్థానిక మహిళలు ఈనెల 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

గుమ్మలక్ష్మీపురం: సారా కేసుల్లో పట్టుకున్న నాలుగు ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎల్విన్‌పేట ఎస్సై ఎస్.షణ్ముఖరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ ఎస్‌డీపీఓ, ఎల్విన్‌పేట సీఐ సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

సరిహద్దు మాతకు వెండి మకరతోరణం


అమ్మవారి అలంకరణ కోసం సిద్ధం చేసిన మకరతోరణం

భామిని: బత్తిలి సమీపంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మాతగా భక్తుల పూజలందుకుంటున్న సంతోషిమాతాకు వెండి మకరతోరణాన్ని అలంకరించేందుకు ఆలయ కమిటీ సిద్ధం చేసింది. భక్తులు సమర్పించిన విరాళాలతో సుమారు 4 కిలోల వెండితో దీన్ని తయారు చేయించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహు తెలిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

కార్పెంటర్ల ఉదారత


కార్పెంటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న హెచ్‌ఎం నాగమణి

వీరఘట్టం: తమకూ ఓ రోజు ఉందంటూ వీరఘట్టంకు చెందిన కార్పెంటర్లు తమ ఉనికిని చాటుకున్నారు. అయితే కేకు కట్ చేసో.. లేక డీజేలు పెట్టి హంగామా చేయలేదు. సోమవారం కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా స్వచ్ఛందంగా సేవ చేసేందుకు వీరు ముందుకొచ్చారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో విరిగిన బెంచీలు, కుర్చీలు, తలుపులకు మరమ్మతులు చేసి తమ ఉదారతను చాటుకున్నారు. కార్పెంటర్లకు హెచ్‌ఎం దూసి నాగమణి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు


పసుకుడి వద్ద రోడ్డుపై నిలిచిపోయిన ఇసుక లారీ

భామిని: ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బత్తిలి ఎగువన ఉన్న ఒడిశా గ్రామాల నుంచి బత్తిలి–భామిని మీదుగా నిత్యం ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక గాలికి ఎగరకుండా కనీసం టార్పాలిన్ కూడా కప్పకపోవడంతో వెనుక వచ్చే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక లారీల కారణంగా ట్రాఫిక్ సమస్యతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. అధికారులు స్పందించి ఒడిశా ఇసుక లారీలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు వేగవంతం

పాచిపెంట: జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని మడవలస మీదుగా జరుగుతున్న విశాఖ – రాయ్‌పూర్ గ్రీన్ నేషనల్ హైవే పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీసి, రహదారిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.


హైవే పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హెల్మెట్ ధరించండి



పాలకొండ: హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని డీఎస్పీ కృష్ణారావు అన్నారు. పాలకొండ పట్టణంలో హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తూ ద్విచక్రవాహనాలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఏలాం సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీఐ మురళీధర్, ఎస్సై శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయండి



పాలకొండ: పట్టణం సమీపంలో రాయుడుకోనేరు గట్టుపై పాకలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు అన్యాయం జరకుండా చూడాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోనేరుగట్టుపై ఉన్న పాకలను తొలగించాలని ఇటీవల సబ్‌కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో బాధితులు ఎమ్మెల్సీ విక్రాంత్‌ను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సబ్‌కలెక్టర్‌ను కలిసి అక్కడి పరిస్థితిని వివరించారు. అక్కడి వారికి ప్రత్యామ్నాయం కల్పించేందుకు ప్రయత్నిస్తామని సబ్‌కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్సీతో పాటు కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు ఉన్నారు.

వ్యర్థాల తొలగింపు



పాలకొండ రూరల్: పాలకొండ–లుంబూరు రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ రోడ్డులో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన విషయం విధితమే. దీంతో నగరపంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి వెంటనే స్పందించి రహదారిపై ఉన్న చెత్తపోగులను సోమవారం యంత్రాల సాయంతో తొలగించారు. నగరపంచాయతీ అధ్యక్షురాలితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మరియదాసు, గణపతిరావు, తదితరులు ఈ పనులను పర్యవేక్షించారు. ఇక్కడకు సమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోవడంతో ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కోరనున్నట్లు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- లబ్ధిదారులకు రూ.3.03 కోట్ల చెక్కు అందజేత
- బ్యాంకు లింకేజీ కింద రూ.2.75 కోట్లు విడుదల


మూడోవిడత 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: రాష్ట్ర ప్రభుత్వం మహిళా పక్షపాతి అని, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండల కేంద్రంలో వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం ఇ.వెంకటకిశోర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే జగనన్న అభిమతమని అన్నారు. ఓట్ల కోసం టీడీపీ నాయకులు లేనిపోని అబద్ధాలు చెప్తూ.. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారికి ప్రజలే సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రూ.3.03 కోట్లు అందజేత

మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఉన్న 624 స్వయం సహాయక సంఘాల్లో 7264 మంది సభ్యులకు 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత కింద ప్రభుత్వం రూ.3,03,31,094లు మంజూరు చేసింది. అలాగే వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 112 సంఘాలకు చెందిన 1344 మంది సభ్యులకు రూ.2.75 కోట్లు బ్యాంకు లింకేజీ నిధులు విడుదల చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి లబ్ధిదారులకు అందజేశారు.


ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

పోటెత్తిన లబ్ధిదారులు

మండల కేంద్రంలో నిర్వహించిన 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత కార్యక్రమానికి 23 పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైకేపీ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగోళ్ల గౌరీశంకరరావు, జిల్లా కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, మండల కోఆప్షన్ మెంబర్ జిలానీ, జిల్లా కళింగవైశ్య సంఘం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకటసురేష్ కుమార్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్‌చంద్రశేఖర్, కురుపాం మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన మహిళలు

వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు



ఆసరా డబ్బులతో వ్యాపారాభివృద్ధికి తోడ్పాదు కలిగింది. మూడేళ్లలో మా సంఘానికి 2లక్షల 50 వేల 680 రూపాయల వరకు అందాయి. ఒక్కొక్కరికి సుమారు రూ.20 వేల వరకు లబ్ధికలిగింది. ఈ డబ్బులతో గ్రామంలోనే చిన్నవ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నాను.

– ఊన్న పద్మావతి, జీవన వెలుగు మహిళా సంఘం, పూతికవలస

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏటా ఆర్థిక సాయాన్ని నేరుగా మా మహిళా సంఘం బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడు విడతల్లో నేను సుమారు రూ.20 వేలు వరకు లబ్ధి పొందాను. ఆర్థికంగా ఆసరాగా ఉన్న ముఖ్యమంత్రికి మేము రుణపడి ఉంటాము.

– తంగుడు మౌళీశ్వరి, జీవన వెలుగు మహిళా సంఘం, పూతికవలస

3న ఉచిత కంటి వైద్యశిబిరం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలో పి.లేవిడి గ్రామంలోని యేసు తిరుహృదయ దేవాలయం సమీపంలో ఏప్రిల్ 3న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లేవిడి యంగ్‌స్టార్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.స్వరాజ్, పి.అజయ్, ఉపాధ్యక్షుడు పి.అమర్‌నాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు, జిల్లా కంటివెలుగు సెల్ వైద్యాధికారి పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. ఎంపిక చేసిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేవీకే అధికారుల తీరు సరికాదు


మాట్లాడుతున్న గిరిజన ప్రజాప్రతినిధులు

కురుపాం: మెగా కిసాన్ మేళాకు కొందరినే ఆహ్వానించి మరికొంతమందిని ఆహ్వానించకపోవడం సరికాదని, కృషివిజ్ఞాన కేంద్రం సిబ్బంది తీరుమార్చుకోవాలని రైతుభరోసా మండల చైర్మన్ బొడ్డుదొర ధమయంతి, కోకన్వీనర్ పాపారావు, నీలకంఠాపురం చైర్మన్ బిడ్డిక అన్నాజీరావు, సుబ్బులు ఆవేదన వ్యక్తం చేశారు. కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన మెగా కిసార్ మేళాకు కనీసం సమాచారం ఇవ్వలేదని, అధికార పక్షంలో ఉన్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అలాగే నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన, ప్రచారం చేయటంలో కూడా కేవీకే సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేవీకే అధికారులు తీరుమార్చుకోవాలని కోరారు.

నిర్మాణాలను ప్రోత్సహించాలని వినతి


రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషాకు వినతపత్రం ఇస్తున్న బోగి లత

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో జగనన్న గృహనిర్మాణ పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోగి లత కోరారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషాను విజయవాడలో సోమవారం కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించారు. పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని, కొత్త గృహాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. ఆమెతో పాటు వీరఘట్టం పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి ఉన్నారు.

బీటీరోడ్డు పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కాంట్రాక్టర్, స్థానిక వ్యాపారులు

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. రూ.5.50 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. ఏప్రిల్ 30 నుంచి గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం కానున్నందున ఆ లోగా రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. వాతావరణం అనుకూలిస్తే 20 రోజుల్లో పనులు పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానిక వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దినసరి వేతనం రూ.250 అందేలా ఉపాధి పనులు


ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

భామిని: ఉపాధిహామీ వేతనదారులకు రోజువారీ కనీస వేతనం రూ.250లు వచ్చేలా పనులు కేటాయించాలని ఏపీడీ, సామాజిక తనిఖీ ప్రజావేదిక పరిశీలనాధికారి ఎస్.శ్రీహరి అన్నారు. మండల పరిషత్ వద్ద సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఆడిట్ రిపోర్టును చదివి వినిపించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు సంబంధించి వర్క్ డిమాండ్‌లు సిద్ధం చేయాలన్నారు. మస్తర్లలో దిద్దుబాటు ఉంటే విధిగా టీఏ సంతకం ఉండాలన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 939 పనులకు సంబంధించి రూ.9,32,19,700ల వినియోగంపై తనిఖీలు చేపట్టగా.. అందులో వేతనాల కింద రూ.5,96,77,069లు, మెటీరియల్ కోసం రూ.3,35,42,630లు ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, ఉపాధి ఏపీఓ జి.తులసీదాస్, క్లస్టర్ టీఏ పి.గంగాధర్, ఐకేపీ ఏపీఓ రాణి, సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ ఎస్.మీరావల్లి, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రేపు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈనెల 29న 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఎం జి.శివున్నాయుడు సోమవారం తెలిపారు. ఆసరా పథకం కింద మండలంలోని 1379 డ్వాక్రా సంఘాలలో ఉన్న 14,383 మంది మహిళలకు మూడో విడతగా ప్రభుత్వం రూ.9.84 కోట్లు విడుదల చేసిందన్నారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులమీదుగా చెక్కు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులంతా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

చెత్తనుంచి సంపద తయారీతో గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

సీతానగరం: గ్రామాల్లో నెలకొల్పిన ఎస్‌డబ్ల్యూపీసీల్లో (చెత్తనుంచి సంపద తయారు) సేకరించిన తడిచెత్త–పొడి చెత్త ద్వారా పంచాయతీ పాలకులు సంపద తయారుచేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు మండలంలోని కాశీపేటలో గల ఎస్‌డబ్ల్యూపీసీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా రోజు వారీ వేర్వేరుగా సేకరిస్తున్న తడిచెత్త, పొడి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలో శుద్ధి చేసి, వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చన్నారు. జిల్లాలోని పంచాయతీ పాలకులు చెత్తనుంచి సంపదతయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

గిరిజన స్పందనకు 35 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 35 వినతులు అందినట్లు ఏపీఓ వై.రోసిరెడ్డి తెలిపారు. జీడిపంటకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ అంటికొండకు చెందిన నిమ్మక సుందరరావు, పంచాయతీ భవనం, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల పెయింటింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ జిల్లేడుపాడుకు చెందిన గౌరీష్ స్పందనలో వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ పైపులైన్ మంజూరు చేయాలని చొర్లంగికి చెందిన గంగమ్మ, సీహెచ్‌డబ్ల్యూ పోస్టు మంజూరు చేయాలని జల్లారగూడకు చెందిన సవర సంగీత కోరారు. చిన్నబగ్గ నుంచి దిగువ సంకిలి వరకు సీసీరోడ్డు మంజూరు చేయాలని బి.మల్లేశ్వరరావు, లోవగూడ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని సుందరరావు, కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని దేవనాపురానికి చెందిన ఎం.సంతోష్ కోరారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి


గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషిచేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు సూచనలు, సలహాలు అందించారు.

అనంతరం రావుపల్లి, కొత్తపల్లి పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈదురుగాలులు, కుండపోత


భామిని: బాలేరు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, గొట్టివలస, పెద్దూరు తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు కారణంగా ఉదయం ఎండ, సాయంత్రం వర్షం కురుస్తోంది. అకాల వర్షాల కారణంగా మండలంలోని కొత్తపల్లి, గిజబ, నందివానివలస, సంతోషపురం తదితర గ్రామాల్లో అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

- కొమరాడ: మండలంలో గతకొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కళ్లికోట, దుగ్గి, దళాయపేట, గుణానపురం, విక్రంపురం, పరుశురాంపురం, గంగారేగువలస తదితర గ్రామాల్లో జొన్న, అరటి, నువ్వు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాలను పరిశీలించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.
- భామిని: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏబీరోడ్డుపై భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షమని పలువురు అంటున్నారు. పలుచోట్ల వీధికాలువల్లో చెత్తపేరుకుపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి ప్రవేశించింది. మండల వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో ప్రజలు అల్లాడుతున్నారు.


భామిని: నేరడిలో కురుస్తున్న వర్షం


గరుగుబిల్లి: గొట్టివలసలో కురుస్తున్న వర్షం

లెప్రసీ రోగులకు అన్నదానం

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి లెప్రసీ హాస్పిటల్‌లో రోగులు 30మందికి పెదపెంకి గ్రామానికి చెందిన ఈర్ల సంజీవనాయుడు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తన తల్లి స్వర్గీయ సత్తెమ్మ నాల్గవ వర్ధంతి సందర్భంగా రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంజీవనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఈర్ల కళావతి, ఎం.శ్రీను, ఎస్.భూషణరావు, మధు, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు


లచ్చయ్యపేటలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాలు పూర్తి కావచ్చాయని తెలియజేశారు. బోర్లకు విద్యుత్ కనెక్షన్లు సమకూర్చి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామని, అసంపూర్తిగా ఉన్న లచ్చయ్యపేట వాటర్ ట్యాంక్‌లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, ఎంపీటీసీ ఎ.సింహాచలం పాల్గొన్నారు.